పురపాలికల మాస్టర్ ప్లాన్‌కు డ్రోన్ సర్వే..


డ్రోన్ ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, పుర అధ్యక్షురాలు మంజుల, అధికారులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో డ్రోన్ సర్వే ద్వారా మాస్టార్ ప్లాన్‌కు రూపకల్పన చేయనున్నామని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పుర అధ్యక్షురాలు మంజుల, సర్వే ఆఫ్ ఇండియా అధికారులు, డీటీసీపీ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రోన్‌కు పూజలు చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా పురపాలికల మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ సుధీర్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, పుర అధ్యక్షురాలు మంజుల, డిప్యూటీ డైరెక్టర్ రమేశ్‌బాబు, సర్వే ఆఫ్ ఇండియా సంయుక్త సంచాలకులు భాస్కర్ చంద్ర, పుర ఇన్‌ఛార్జి కమిషనర్ రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

- జిల్లాలో ధాన్యం సేకరణను పకడ్బందీగా నిర్వహించాలని ఇందుకోసం అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. బుధవారం తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో 125 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, శిక్షణ కలెక్టర్ ఉమా హారతి, డీర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా వ్యవసాధికారి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే వ్యాధుల నియంత్రణ

తాండూరు టౌన్, న్యూస్‌టుడే: పోషక ఆహారం తీసుకోవటంతో వ్యాధులను నియంత్రించే అవకాశాలు ఉంటాయని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టరు రవీంద్ర యాదవ్ తెలిపారు. తాండూరులోని జిల్లా ఆస్పత్రిలో బుధవారం రోగాల ఉపశమన సంరక్షణపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు తప్పకుండా ప్రతి రోజు పోషక విలువలు కలిగి ఉన్న ఆహారాన్నే తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టరు ఆనంద్ గోపాల్‌రెడ్డి, జయరాం, రేణుకుమార్, సుప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సరఫరా జాగ్రత్తలపై అవగాహన

మోమిన్‌పేట: తాగు నీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని మిషన్ భగీరథ డీఈఈ రత్నప్రసాద్, ఎంపీడీవో విజయలక్ష్మి, గ్రామ పంచాయతీ నీటి సహాయకులకు సూచించారు. ఈనెల 7వ తేదీనుంచి మండల పరిషత్తు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టారు. బుధవారం కొనసాగిన మూడో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ఎంపీడీవోతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సువర్ణల, ఎంపీవో యాదగిరి, ఏఈఈ అభిషేక్ తివారి తదితరులు పాల్గొన్నారు.

బంగారు రుణం.. ప్రగతికి ప్రయోజనం

- తాకట్టుపై మంజూరు
- ఉమ్మడి జిల్లాలోనే తాండూరు ప్రథమం

న్యూస్‌టుడే, తాండూరు గ్రామీణ

వ్యాపార కేంద్రంగా పేరొందిన తాండూరులో బంగారం తాకట్టు రుణాలు ఏటా పెరుగుతున్నాయి. రూ.కోట్లల్లో రుణ మంజూరులో ఏకంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే గత ఆర్థిక సంవత్సరంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రథమ స్థానంలో నిలిచింది. దీనికి సంబంధించి 'న్యూస్‌టుడే' కథనం.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వేదికగా..

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 49 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయి. తాండూరు మండలంలో ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 33 పంచాయతీల్లోని 2200మందికిపైగా రైతులు సభ్యులుగా నమోదయ్యారు. ఈ సంఘం ద్వారా ఏటా రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట రుణాల్ని పంపిణీ చేస్తున్నారు.

2012లో శ్రీకారం

ఈ సహకార సంఘం ద్వారా బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేయడం 2012 సంవత్సరంలో ప్రారంభించారు. రూ. 10 లక్షలతో ప్రారంభమైన రుణాల పంపిణీ పన్నెండు సంవత్సరాల్లో ఏకంగా రూ. 21.32కోట్లకు చేరింది. ఇప్పటివరకు 17వేల మందికిపైగా పొందారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీలో సంఘానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటిస్థానం దక్కింది. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తాండూరు ఎమ్మెల్యే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార సంఘాల మాజీ అధ్యక్షులు బుయ్యని మనోహర్ రెడ్డి అధికారుల్ని అభినందించారు.



తీరుతున్న అవసరాలు

- రుణాలు పొందుతున్న వారిలో వ్యాపారులే ఎక్కువ.
- పిల్లల ఉన్నత చదువులకు, వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల కొనుగోలుకు స్వీకరణ.
- చిన్నతరహా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు, స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు వినియోగం.
- ఇప్పటికే వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు మరింత విస్తరించేందుకు, కొత్తగా మరిన్నిచోట్ల వ్యాపారాలను ప్రారంభించేందుకు స్వీకరణ.



అడిగిన వెంటనే ఇస్తున్నాం

వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు, డీఏపీ యూరియా అందజేస్తున్నాం. దీంతోపాటు బంగారం తాకట్టు రుణాల్ని మంజూరు చేస్తున్నాం. ముఖ్యంగా రైతులకు సాగుకు సకాలంలో ఉపయోగపడే విధంగా అండగా నిలిచేందుకు యత్నిస్తున్నాం. పోటీని తట్టుకొని ఎక్కువ మందికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇతర అవసరాల వారు సైతం కేంద్రంలో సంప్రదించవచ్చు.– **శ్రీనివాస్, సీఈఓ, ఎల్మకన్నె సహకార సంఘం, తాండూరు.**

భూమి హద్దుల ఏర్పాటు నిలువరింత


కూలీలను వెనక్కి పంపుతున్న గ్రామస్థులు

తాండూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సిరిగిరిపేట శివారులోని ప్రభుత్వ స్థలంలో హద్దు రాళ్లు పాతే పనులను బుధవారం అడ్డుకున్నామని గ్రామస్థులు తెలిపారు. తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఊరి చివరనున్న సర్కారు స్థలాన్ని గత ప్రభుత్వం విక్రయించడం, తాజాగా హద్దులు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ఆ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు పనుల వద్ద ఉన్న సిబ్బంది గ్రామస్థులకు వెల్లడించారు. అందుకు సంబంధించి పత్రాలను చూపించాలని కోరగా గురువారం అందజేస్తామని చెప్పారు. అప్పటివరకు పనులు నిలిపివేయాలనడంతో కూలీలు, సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు.

లక్ష్యం మేరకు భాజపా సభ్యత్వాలు


సభ్యత్వ నమోదులో శిరీష తదితరులు

కుల్కచర్ల, న్యూస్‌టుడే: లక్ష్యం మేరకు భాజపా సభ్యత్వాలను నమోదు చేయిస్తామని జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు శిరీష పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలో మండల భాజపా అధ్యక్షులు సూర్యకాంత్, మాజీ సర్పంచ్ జానకీరాం, సౌమ్యారెడ్డి తదితరులతో కలసి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

భర్తకు భయపడే వెళ్లిపోయాం

తల్లి, ఇద్దరు పిల్లలు ఠాణాలో ప్రత్యక్షం



తల్లి, పిల్లలతో మాట్లాడుతున్న బషీరాబాద్ ఎస్ఐ గఫార్

బషీరాబాద్: నిత్యం తాగి వచ్చి కొట్టడం, తిట్టడం చేస్తుండటంతో భయపడి ఇంటి నుంచి వెళ్లిపోయానని అదృశ్యమైన ఇద్దరు పిల్లల తల్లి అన్నారు. బుధవారం ఆమె బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ గఫార్ ఎదుట కన్నీటి పర్యంతమైంది. ఎస్ఐ, బాధితులు తెలిపిన ప్రకారం.. ఈనెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మి, పిల్లలు సరిత, జగన్ కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు రైలులో చేరుకున్నారు. చేతిలో ఉన్న డబ్బులు అయిపోవడంతో నేరుగా బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌కు వచ్చానని ఆమె పేర్కొంది. భర్త, ఆమె తల్లిని పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. కొన్ని రోజులపాటు తన తల్లి ఉన్న బద్లాపూర్‌లోనే ఉంటానని పేర్కొనగా ఎస్ఐ భార్యాభర్తలిద్దరినీ సముదాయించి పంపించారు.

రెండోసారి గనుల్లో కొలతలు వాయిదా

తాండూరుగ్రామీణ, న్యూస్‌టుడే: ఓగీపూర్‌లోని నాపరాయి గనుల్లో నిర్వహించాల్సిన కొలతల ప్రక్రియ రెండోసారి వాయిదాపడింది. సర్వే సంఖ్య 65లోని నాపరాయి తవ్వకాలపై పోలీసు బందోబస్తు నడుమ గనులు భూగర్భ వనరుల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం కొలతలు చేసేందుకు ఖరారు చేశారు. ఉదయం 9గంటల ప్రాంతంలో వర్షం కురిసిన కారణంగా కొలతలు నిర్వహించే ప్రక్రియను అధికారులు వాయిదా వేశారు. గతనెల 25న కొలతలు చేసేందుకు తొలుత ప్రకటించారు. అప్పట్లో వర్షం కురిసే అవకాశముందని వాయిదా వేసిన అధికారులు ఈసారీ వర్షం పడటంతో వాయిదా వేశారు.

ఆలయ ఆరంభం.. గిరిజన సంతసం



దుద్యాల, న్యూస్‌టుడే: మండలంలోని పోలేపల్లి తండాలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయ ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా జరిపారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ ఉత్సవాల్లో భాగంగా గణపతిపూజ, ప్రదోషకాల పూజలు, హారతి వేద పండితుల ఆశీర్వచనం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపి, గిరిజన సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

రేకుల షెడ్డు కాదు.. బస్ షెల్టర్!



ప్రయాణికుల కోసం బీజాపూర్ -హైదరాబాద్ జాతీయ రహదారిపై లఖ్నాపూర్ ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ చెత్త దుకాణాల కారణంగా కనిపించకుండా పోతోంది. ఇరువైపులా సంచులుగా కుట్టి పడేశారు. దీనికి తోడు చెట్టు కొమ్మలు పైభాగంలో పడటంతో ఎవరికీ కనిపించడం లేదు. దీంతో ఎవరూ వినియోగించుకునే అవకాశం లేకుండా పోతోంది. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే,పరిగి.

దూడను చంపిన చిరుత.. భయాందోళనలో ప్రజలు


మృతిచెందిన దూడను పరిశీలిస్తున్న ఎఫ్‌ఆర్వో రాజేందర్, ఎఫ్ఎస్ఓ శంకర్

యాలాల, న్యూస్‌టుడే: జిల్లాలో చిరుతల సంచారం మళ్లీ కలకలం రేపుతోంది. ఎనిమిది నెలల క్రితం కుల్కచర్ల మండలంలో అనంతసాగర్‌లో చిరుతపులి ఆవుపై దాడి చేసి చంపేసింది. తాజాగా మండల పరిధిలోని రేండ్లగడ్డ తండాలో కోడెదూడపై దాడి చేసి చంపేసింది. దీంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. విషయాన్ని తండా వాసులు ఎఫ్‌ఆర్వో రాజేందర్ రెడ్డి, ఎఫ్ఎస్ఓ శంకర్, యాలాల ఎస్సై శంకర్‌లకు వివరించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఎఫ్‌ఆర్వో రాజేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. రేండ్లగడ్డ తండాకు చెందిన సక్రీబాయి కోడెదూడను పొలంలో మంగళవారం రాత్రి కట్టి వేసింది. అర్ధ రాత్రి దానిపై యుక్తవయస్సు ఉన్న చిరుత దాడి చేసినట్లు గుర్తించామన్నారు. చిరుత సంచారంగానే భావిస్తున్నామన్నారు. అంతకుముందు చిరుత పాదాల గుర్తులను ఎఫ్‌ఆర్వో చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి గమనించారు.


సీసీ కెమెరా ఏర్పాటు చేసిన అటవీ సిబ్బంది

అప్రమత్తంగా ఉండండి: ఎమ్మెల్యే బుయ్యని

చిరుత సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. రాత్రి సమయంలో ఆయా గ్రామాల్లో అటవీ అధికారులు, పోలీసులు సమన్వయంతో గస్తీ నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి శంకర్ తెలిపారు.

వైద్య విద్య.. మరింత చేరువ

- కళాశాలల భవన నిర్మాణాలకు వడివడిగా చర్యలు
- రూ.457.5 కోట్ల వ్యయం

న్యూస్‌టుడే, తాండూరు: జిల్లా వాసులకు వైద్య విద్య, తదనంతర సేవలు మరింత చేరువ కానున్నాయి. ఇప్పటికే జిల్లా కేంద్రం, తాండూరు పట్టణాల్లో జిల్లా ఆసుపత్రులు కొనసాగుతున్నాయి. వీటికి తోడు జిల్లాకు మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణం పూర్తయితే స్థానికులకు మరింత నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. బయటి పేషెంట్లు వచ్చి చికిత్సలు చేసుకునే అవకాశం లభిస్తుంది. వీరిలో కొందరికి కొన్ని సందర్భాల్లో చిన్నపాటి శస్త్రచికిత్సలను కూడా చేయాల్సి ఉంటుంది. ప్రొఫెసర్లు శస్త్రచికిత్సలు చేస్తూనే వైద్య విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు మెలకువలు వివరిస్తారు. రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు కూడా అత్యవసర వైద్య సేవలు అందుతాయి.


తాండూరులో నిర్మాణంలో ఉన్న నర్సింగ్ కళాశాల

కళాశాలల భవనాలకు నిధుల మంజూరు (రూ.కోట్లలో)	
• వికారాబాద్ వైద్య	235
• కొడంగల్ వైద్య	124.5
• కొడంగల్ నర్సింగ్	46
• తాండూరు నర్సింగ్	25
• కొడంగల్ పారామెడికల్, ఫిజియోథెరఫీ	27

తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు: జిల్లాలో వికారాబాద్, కొడంగల్‌కు వైద్య కళాశాలలు మంజూరైన విషయం విదితమే.. వికారాబాద్‌లో పనులు ప్రారంభమైతే కొడంగల్‌లోని అప్పాయిపల్లిలో భూసేకరణ పూర్తయింది. పనులు చేపట్టేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచే పనిలో నిమగ్నమైంది. ఇదే సమయంలో తాండూరు, కొడంగల్‌లో నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. తాండూరులో ఇప్పటికే కళాశాలకు సంబంధించిన భవన నిర్మాణం జరుగుతోంది.

టెండర్లు పూర్తి కాగానే పనులు

– శ్రీధర్‌రెడ్డి, జిల్లా రహదారులు, భవనాల శాఖ ఈఈ, వికారాబాద్

కొడంగల్‌లో కళాశాలల నిర్మాణాలకు భూసేకరణ పూర్తయింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు శరవేగంగా జరుగుతాయి. వికారాబాద్‌లో ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి.

ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి

– లక్ష్మీనారాయణ, వైద్య, ఆరోగ్య శాఖ డీఈ, వికారాబాద్

తాండూరులో చేపడుతున్న నర్సింగ్ కళాశాల నిర్మాణాన్ని ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పూర్తి చేస్తాం. పనులు పూర్తి కాగానే సంబంధిత అధికారులకు భవనాన్ని అప్పగిస్తాం.

తమ్ముడని నమ్మితే అసలుకే మోసం

న్యాయం చేయాలని ఓ అన్న ఆవేదన

వికారాబాద్, న్యూస్‌టుడే: తోడబుట్టిన తమ్ముడని నమ్మితే ఎకరా పొలానికి ఎసరు పెట్టాడని, న్యాయం చేయాలని కోరుతూ ఓ అన్న వికారాబాద్ తహసీల్దారును ఆశ్రయించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు గ్రామ శివారులో వంశపారంపర్యంగా వచ్చిన భూములను చెరి సగం (ఒక్కొక్కరికి 2.28 ఎకరాలు) పంచుకున్నారు. ఎవరికీ ఒకే బిట్టుగా రాలేదు. పంపకంలో తమ్ముడికి చిన్న కమతాలుగా 0.16 ఎకరాలు ఒక దగ్గర, మరో 0.25 ఎకరాలు ఒక దగ్గర వచ్చింది. వీటి మధ్యలో అన్నకు చెందిన 1.01 ఎకరాల పొలం ఉంది. ఆర్థిక ఇబ్బందులతో 2004లో తమ్ముడు తన వాటా విక్రయానికి పెట్టగా మొత్తం ఒకే దగ్గర ఉంటేనే కొంటామన్నారు. దీంతో సమస్యను అన్నకు చెప్పగా తన వాటా 1.01 ఎకరాలను తీసుకోమన్నాడు. దీనికి బదులుగా తనకు ఆ స్థలానికి సమీప దూరంలో వచ్చిన 1.01 ఎకరాల పొలాన్ని ఇచ్చేలా గ్రామస్థుల సమక్షంలో ఒప్పంద పత్రాన్ని అన్నకు రాసి ఇచ్చాడు. ఆ ప్రకారంగానే ఒకే బిట్టుగా 2.28 ఎకరాల పొలాన్ని 2004లో కొనుగోలుదారుకు విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. ఆ డబ్బులతో తమ్ముడు రాజధానికి వెళ్లి స్థిరపడ్డారు.

రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం వలే..

'తమ్ముడే కదా' అనే నమ్మకంతో పొలాన్ని తన పేరిట మార్చుకోలేదు. ఆన్‌లైన్లో తమ్ముడి పేరు మీదే 0.16, ఎకరాలు, 0.25 ఎకరాలు (రెండూ కలిపితే ఎకరం గుంటా) ఉంది. దీన్ని అన్న సాగు చేసుకుంటున్నాడు. ఇప్పుడు ఎకరం రూ. కోటి పలుకుతోంది. ఆన్‌లైన్‌లో తమ్ముడి పేరే చూపిస్తుండటంతో పలువురు స్థిరాస్తి మధ్యవర్తులు తమ్ముడితో బేరసారాలకు దిగారు. అన్న సంగతి తాము చూసుకుంటామన్నారు. గత ఒప్పందాన్ని కాదని విక్రయాన్ని తమ్ముడు సిద్ధపడ్డాడు. విషయం తెలిసిన అన్న ఆందోళనతో తహసీల్దారు కార్యాలయానికి వచ్చి న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యాడు.

క్షేత్రస్థాయిలో విచారణ జరిపిస్తాం

నారాయణపూర్‌కు చెందిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించా. గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి విచారణలో తేలిన అంశాలను కలెక్టర్‌కు నివేదిస్తాం. – **లక్ష్మీనారాయణ, ఎంఆర్ఓ, వికారాబాద్.**

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి


కేంద్రం ప్రారంభంలో అధికారులు, నాయకులు

బొంరాస్‌పేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని తుంకిమెట్ల రైతు వేదికలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీసీఎంఎస్ మేనేజరు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ బొంరాస్‌పేట మండలంలో తుంకిమెట్లతో పాటు బాపల్లి తండా, వడిచెర్ల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, నర్సింహులు నాయుడు, అంజిల్‌రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

రైల్వే ఆధునికీకరణ నత్తనడక

న్యూస్‌టుడే, వికారాబాద్ కలెక్టరేట్, పరిగి:

ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రైల్వే స్టేషన్ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'అమృత్ భారత్' కింద శ్రీకారం చుట్టింది. తెలంగాణలో 15 రైల్వే స్టేషన్లు ఎంపిక చేయగా దీన్లో వికారాబాద్, తాండూరు కూడా ఉన్నాయి. ప్రధానంగా జిల్లా కేంద్రం వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ ఎక్కువ. దీని పునర్ నిర్మాణానికి రూ. 24.35 కోట్లు మంజూరు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించి మూడు నెలలు కొనసాగిన తరువాత ఆగిపోయాయి. అసంపూర్తి పనులతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడంలేదు.

ముఖచిత్రమే మారిపోతుందన్నారు

రైల్వే స్టేషన్ ముఖ చిత్రం మార్చే విధంగా ఆధునిక హంగులతో స్టేషన్ భవనం, ఫ్లోరింగ్ నిర్మాణానికి ముఖ ద్వారాన్ని, విశ్రాంతి గదిని కూల్చివేశారు. మొదట కవర్ ఆఫ్ ప్లాట్ ఫాం కింద షెడ్ల విస్తరణ చేపట్టారు. ప్రయాణికులకు సౌకర్యంగా నీడనిచ్చే విధంగా షెడ్డు నిర్మాణ పనులు మొదలు పెట్టి వదిలేశారు. స్టేషన్ పేరు తెలిపే బోర్డులను సైతం తొలగించి ప్లాట్‌ఫాంపై పెట్టారు. పిల్లర్లకు గుంతలు తవ్వారు. కొత్తగా లిఫ్‌ను ఏర్పాటు చేశారు. తరువాత వీటి పురోగతిని పట్టించుకోవడం మానేశారు

నిజాం నవాబుల కాలంలో..

స్వాతంత్ర్యానికి ముందు సికింద్రాబాద్ నుంచి వాడి వరకు రైల్వే లైన్‌ను ఏర్పాటు చేశారు. నిజాం కాలంలో తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలను అనుసంధానిస్తూ రైల్వే లైన్‌ను వేశారు. మధ్యలో వికారాబాద్ ఉండటంతో ఇక్కడ రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. రద్దీ స్టేషన్ కావటంతో 2010లో ఆదర్శ్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేశారు. ఆ తర్వాత గత ఫిబ్రవరిలో మరోసారి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.


వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో పిల్లర్లు

నిత్యం 15,000 మంది రాకపోకలు

ఈ స్టేషన్ మీదుగా ముంబయి, బెంగళూర్, బీదర్, పుణె, షిర్డీ, తిరుపతి, గుంటూరు, పల్నాడు తదితర ప్రాంతాలకు నిత్యం 25 రైళ్లు నడుస్తాయి. రూ.4 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. వికారాబాద్ ప్రాంత వాసులే కాకుండా సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ ప్రాంత వాసులు ఇక్కడి నుంచి ప్రయాణాన్ని సాగిస్తారు. హైదరాబాద్‌లో ఉంటూ వికారాబాద్‌లో విధులు నిర్వహించే వారు కూడా రైలులో వచ్చివెళుతుంటారు. ఇలా నిత్యం 15 వేల మంది రైలులో ప్రయాణిస్తుంటారు.

పనుల్లో వేగం పెంచుతాం

వికారాబాద్ రైల్వే జంక్షన్‌లో కొనసాగుతున్న ఆధునికీకరణ పనుల్లో వేగం పెంచుతాం ఇటీవల నేను స్వయంగా స్టేషన్‌లో కొనసాగుతున్న విశ్రాంతి గదుల అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించా. పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని వేగం పెంచి నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించా. తగు చర్యలు తీసుకుంటాం. – **బర్తేష్‌కుమార్ జైన్, డీఆర్ఎం, సికింద్రాబాద్.**

విధుల్లో 280 మంది నూతన ఉపాధ్యాయులు

వికారాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల ఉత్తర్వులు అందుకున్న 280 మంది కొత్త టీచర్లు బుధవారం వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారు. మంగళవారం జిల్లా పరిషత్తుకార్యాలయంలో జరిగిన కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులకు పాఠశాలను కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. 353 పోస్టులుండగా వివిధ కారణాలతో 320పోస్టులను భర్తీ చేశారు. మంగళవారం రాత్రివరకు సుమారుగా 280 మందికిఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, భాషాపండితులున్నారు.

సోయాబీన్స్ తగ్గుముఖం



విపణిలో సోయాబీన్స్ ధాన్యం

న్యూస్‌టుడే, జహీరాబాద్: వర్షాధారంగా సాగు చేసే వాణిజ్య పంటల్లో ప్రధానమైంది సోయాబీన్స్. జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్ ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు సాగు చేసేవారు. సమయానుకూలంగా వర్షాలు కురవకపోవడం, విపణిలో గిట్టుబాటు ధర లభించక పోవడంతో సాగు చేసే రైతుల సంఖ్య తగ్గుతోంది. దానికి బదులుగా పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. దాదాపు రెండు నెలలుగా తరచుగా కురుస్తున్న వర్షాలతో ఈ ఏడు వేసిన కొద్దిపాటి పంట సైతం దెబ్బతినటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, జిల్లాలోని విపణులు వెలవెల బోతున్నాయి. సాధారణానికి భిన్నంగా గత రెండు, మూడేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది.

సంవత్సరం	రైతులు	ఎకరాలు
2022	40514	76442
2023	20500	41756
2024	15000	35000

మహారాష్ట్రలో మిల్లులు ఎక్కువ

సోయాబీన్ ధాన్యాన్ని నూనె మిల్లుల నిర్వాహకులు కొనుగోలు చేస్తారు. నూనె తీయడంతో పాటు పిండిని కోళ్ల దాణాకు ఉపయోగిస్తుంటారు. మిల్లుల ఏర్పాటుకు మహారాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వరకు రాయితీ ఇవ్వడంతో అక్కడ ఎక్కువగా ఉన్నాయి. మన రాష్ట్రంలో జహీరాబాద్, రామాయంపేట, కరీంనగర్‌లో ఒక్కొక్కటి చొప్పున, హైదరాబాద్‌లో రెండు ఉన్నాయి. జహీరాబాద్‌కు కేవలం వంద కిలోమీటర్ల దూరంలోనే మహారాష్ట్రలో మిల్లులు ఉండటంతో అటు ఎక్కువగా సోయాబీన్స్ తరలిస్తారు.



రాయితీలు ప్రకటించాలి: అతివృష్టి, అనావృష్టిలతో నాలుగేళ్లుగా సోయాబీన్స్ పంట దిగుబడులు పడిపోతున్నాయి. నష్టాలతో సాగు చేయలేక ఇతర పంటల వైపు మళ్లుతున్నారు. ప్రభుత్వం రాయితీలు ప్రకటించి ఆదుకోవాలి. ఈ సంవత్సరం దాదాపు రెండు నెలలుగా ప్రతిరోజు వాన కురుస్తోంది. కనీసం పెట్టుబడులైనా రావడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించాలి.
– గోవింద్‌రెడ్డి, బూచినెల్లి

రాజస్థాన్ సదస్సుకు పొట్లపల్లి విద్యార్థి ఎంపిక



కల్లెపల్లి ప్రశాంత్

న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం: రాజస్థాన్‌లోని మహరాజా గంగాసింగ్ విశ్వవిద్యాలయంలో జరిగే 61వ ఆలిండియా రాజనీతి శాస్త్రం అంతర్జాతీయ సదస్సులో పాల్గొనే అవకాశం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లికి చెందిన పరిశోధక విద్యార్థి కల్లెపల్లి ప్రశాంత్‌కు దక్కింది. ఆయన ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యాభ్యాసాన్ని హుస్నాబాద్, వరంగల్‌లో పూర్తి చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ రాంచంద్రం పర్యవేక్షణలో 'తెలంగాణలో షెడ్యూలు తెగల రిజర్వేషన్ల ప్రభావం' అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ నెల 18, 19 తేదీలలో రాజస్థాన్ సెమినార్‌లో పాల్గొంటారు. అందులో 'భారతదేశంలో మారుతున్న ప్రజాస్వామ్యం, రాజకీయ అవకాశాల పరిమితులు' అంశంపై ప్రసంగిస్తారు. 'వికసిత్ భారత్ 2047'లో భాగంగా ఈ సదస్సును ఏర్పాటు చేశారు. ప్రశాంత్‌ను గ్రామస్థులు, అధ్యాపకులు అభినందించారు.

బసవేశ్వర ఉత్సవం.. తరలుతున్న భక్తజనం



బసవకల్యాణ్‌లో 108 అడుగుల విగ్రహం

న్యూస్‌టుడే, జహీరాబాద్: మానవతావాది, లింగాయత్, బసవ ధర్మీయుల ఆరాధ్య దైవం బసవేశ్వరుడికి ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు 'కల్యాణపర్వ' ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వీటికి జహీరాబాద్, నారాయణఖేడ్, అందోలు, సంగారెడ్డి ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్తున్నారు. జహీరాబాద్‌కు 90 కిలో మీటర్ల దూరంలో బసవకల్యాణ్ ఉంది. ఎత్తైన గుట్టపైన, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్యలో 21 ఎకరాల స్థలంలో 108 అడుగుల భారీ విగ్రహాన్ని 2014లో నిర్మించారు. ఆ ప్రాంతానికి 'శరణుశైల'గా నామకరణం చేసి ఏడాదికోసారి కల్యాణ పర్వాన్ని నిర్వహిస్తున్నారు. అక్కడ గుహలు, సొరంగం, బసవేశ్వరుడి బోధనల చిత్రాలు ఉన్నాయి. జహీరాబాద్, అందోలు, నారాయణఖేడ్ ప్రధాన కూడళ్ల వద్ద బసవేశ్వరుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. గ్రామాలలో బృందాలుగా ఏర్పడి ప్రత్యేక వాహనాలు సమకూర్చుకొని బయలుదేరారు.



భోజన, వసతి ఏర్పాట్లు చేశాం:
–శంకర్ పాటిల్, రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ అధ్యక్షుడు

బసవకల్యాణ్ పట్టణంలో మూడు రోజుల పాటు జరుగు కల్యాణపర్వానికి మన ప్రాంతం నుంచి భక్తులు ఎక్కువ సంఖ్యలో రానున్నందున తగిన వసతి ఏర్పాట్లు పూర్తిచేశాం. భోజన, వసతి ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి కల్యాణపర్వం కార్యక్రమం గురించి భక్తులకు తెలియజేశాం. జహీరాబాద్-ముంబయి జాతీయ రహదారిపై ఉన్నందున రాకపోకలకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉన్నాయి.


రూ.144 కోట్ల మద్యం తాగేశారు


- గతేడాది కంటే విక్రయాలు తక్కువ
- సంగారెడ్డి జిల్లాలో మాత్రమే ఎక్కువ





మెదక్, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సాధారణంగా పండగ వచ్చిందంటే ముక్క, చుక్క ఉండాల్సిందే. దసరా లాంటి పెద్ద పండగ వస్తే మద్యం తప్పనిసరి. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో గతేడాది దసరా పండగ సీజన్‌ను ఈసారితో పోల్చితే సంగారెడ్డి జిల్లాలో మాత్రమే మద్యం విక్రయాలు ఎక్కువగా జరిగాయి. మిగతా మూడు జిల్లాల్లో తక్కువ అమ్ముడయ్యాయి. మెదక్ జిల్లాలో కేవలం రెండు రోజుల లోనే రూ. 13.43 కోట్ల విలువైన మద్యాన్ని డిపో నుంచి వ్యాపారులు తీసుకెళ్లారు. మెదక్ జిల్లాలో 48 వైన్స్‌లు, 3 బార్లు ఉన్నాయి. రూ. 59.48 కోట్ల లక్ష్యం పెట్టుకోగా సగమైనా దాటలేదు.

- వికారాబాద్ జిల్లాలో 59 మద్యం దుకాణాలు, 7 బార్లు ఉన్నాయి. మద్యం గొలుసు దుకాణాలు, ధాబాల్లో విచ్చలవిడిగా అమ్మారు.
- ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అమ్మవారి దీక్షలు, శనివారం నాడు పండగ రావడంతో సిద్దిపేట జిల్లాలో అమ్మకాలు తగ్గాయని భావిస్తున్నారు. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల జోరుతో పెరిగాయి. గతంతో పోల్చితే రూ. 4.62 కోట్ల మేర ఆదాయం తగ్గింది.
- సంగారెడ్డి జిల్లాలో నిరుడు దసరా కంటే ఈసారి ఐఎంఎల్ లిక్కర్, బీర్ల ద్వారా జిల్లాకు రూ. 2.17 కోట్ల ఆదాయం ఎక్కువ సమకూరింది. 3.66 శాతం వృద్ధి నమోదైంది. ఈ జిల్లాలో 5 ఆబ్కారీ స్టేషన్‌లు, 101 దుకాణాలు, 34 బార్ రెస్టారెంట్లు ఉన్నాయి.









ఫోన్‌లో ఓటు చూసుకోండి



వివరాలు చూపించే పేజీ

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ: త్వరలోనే స్థానిక సంస్థ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే పంచాయతీ ఎన్నికల నిమిత్తం గ్రామాల్లో తుది ఓటరు జాబితా విడుదల చేశారు. చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. తుది జాబితాను పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో పేరు ఉందీ లేనిదీ సెల్‌ఫోన్‌లో చూసుకోవచ్చు. ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిన వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూస్తే తెలుస్తుంది. tsec.gov.in అని వెబ్‌సైట్‌లో ఎలక్షన్ కమిషన్ పేజీ తెరుచుకుంటుంది. ఫైనల్ రోల్స్ ఐచ్ఛికం కనిపిస్తుంది. జిల్లా, మండలం, గ్రామం వివరాలు నమోదు చేయగానే మరో పేజీ కనిపిస్తుంది. వివరాలు నమోదు చేసిన తర్వాత పంచాయతీకి సంబంధించిన ఓటరు జాబితా కనిపిస్తుంది. వార్డుల వారీగా అందులో పేరు చూసుకోవచ్చు. ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



ఉదయ భానుడు

చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన చిత్రం కాదిది. మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం జగ్గంపేట గ్రామ శివారులో తెల్లవారుజామున ఉదయిస్తున్న సూర్యుడు. గ్రామ శివారులోని కొండల మధ్య నుంచి జ్వాలను తలపించే వెలుగుతో పైపైకి భానుడు వస్తున్నాడు.
– న్యూస్‌టుడే, చిలప్‌చెడ్

పథకాలతో పేదరికం దూరం



మెదక్ టౌన్, న్యూస్‌టుడే: సమాజంలో పేదరికం పెరిగితే అశాంతి, అసమానతలతో ప్రజల మధ్య వైరుధ్యాలు చోటుచేసుకుంటాయి. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరికొత్త చట్టాల ద్వారా, పథకాలతో, బడ్జెట్ కేటాయింపులతో పేదరికాన్ని నిర్మూలించేందుకు లక్ష్యం ఏర్పాటు చేసుకొని ప్రణాళికలు రచిస్తాయి. కరోనా వ్యాప్తి చెందిన సంవత్సరాల నుంచి ఇప్పటివరకూ కేంద్ర ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. ఇల్లు, పారిశుద్ధ్యం, బడి కెళ్లడం, పౌష్టికాహారం తదితరాంశాలను గణించి పేదరికం సూచికలను తయారుచేస్తున్నారు. 2023లో నీతి ఆయోగ్ ప్రకటించిన సూచికల మేరకు వికారాబాద్ జిల్లాల్లో పేదరికం .. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్‌లతో పోల్చితే ఎక్కువగా ఉంది. తెలంగాణ జిల్లాల్లోని పేదరికం ప్రకారం వికారాబాద్ 29వ స్థానంతో అథమంలో ఉంది. మొదటి పది ఉత్తమ స్థానాల్లో మిగతా మూడు జిల్లాలున్నాయి. నేడు 'పేదరిక నిర్మూలన దినోత్సవం' సందర్భంగా కథనం.

అట్టడుగు జీవితం నుంచి యజమాని వరకు..



కొండల్‌రెడ్డి

గుమ్మడిదల, న్యూస్‌టుడే: కొద్దిపాటి పొలంలో వ్యవసాయంతో కుటుంబ ఖర్చులు గడిచేవి కావు. పండగలైనా ఒక్కోసారి సరైన ఆహారమే దొరికేది కాదు. అలాంటి స్థితిలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన లింగాయిగారి కొండల్‌రెడ్డి.. వాహనాల మెకానిజం నేర్చుకున్నారు. ఓవైపు చదువుకుంటూనే తండ్రికి పొలంలో చేదోడువాదోడుగా ఉంటూనే ద్విచక్ర వాహనాలపై మోజుతో వీలైన సమయంలో మెకానిజం నేర్చుకున్నారు. రెండు సంవత్సరాల్లో కష్టపడి సొంతంగా మరమ్మతులు చేయడంలో అనుభవం పొందారు. దోమడుగులో మెకానిక్ దుకాణం ప్రారంభించారు. వాటి సంపాదనతో అభివృద్ధి చెంది.. అక్కడే ప్రస్తుతం ఓ ద్విచక్రవాహనాల షోరూంకు యజమానిగా మారారు. సోదరుడు వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేస్తున్నారు. ఒకనాడు పేదరికంలో మగ్గిన తాము కష్టపడి మరమ్మతులు నేర్చుకొని నేడు తమ కుటుంబ సభ్యులను సంతోష పెట్టగలుగుతున్నామని పేర్కొన్నారు. మరో పది మందికి ఉపాధి కల్పిస్తుండటం సంతృప్తిగా ఉందని తెలిపారు.

ఉపాధికి కొన్ని పథకాలు

పీఎం స్వనిధి: కరోనా సమయం ప్రతి ఒక్క వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వీధి వ్యాపారాలు కోలుకోలేని దెబ్బతిన్నాయి. వీధి వ్యాపారులను గట్టెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం స్వనిధి పేరుతో కొత్త పథకాన్ని ప్రారంభించింది. పూచికత్తు లేకుండా రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు రుణాన్ని ఇస్తారు. వ్యాపారాభివృద్ధి చేసుకోవచ్చు.

కార్పొరేషన్ రుణాలు: ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వం వాహనాలు, వ్యాపారాలకు ఇస్తున్నారు. రాయితీలు ఉన్నాయి.

బ్యాంకు లింకేజీ: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అతి ప్రధానమైన పథకాల్లో బ్యాంకు లింకేజి ఒకటి. ఇది గ్రామాల, పట్టణాల మహిళలను స్వయం సహాయక సంఘాల పేరుతో గ్రూపులుగా చేసి వారికి తక్కువ వడ్డీకి రుణాలను అందజేస్తుంది. సులభంగా తిరిగి చెల్లించవచ్చు. వివిధ రకాల వ్యాపారాలు చేసుకోవచ్చు.

శ్రీనిధి: స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీనిధి పేరుతో పథకం తెచ్చింది. పాడి పశువులకు, మేకలు, కిరాణం, పౌల్ట్రీలకు రుణాలు ఇస్తున్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి దుర్మరణం



సుకూరి భాగయ్య

దుబ్బాక: ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన దుబ్బాక శివారులోని పెద్దచీకోడ్ మార్గంలో బుధవారం చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రైతు సుకూరి భాగయ్య(50), భార్య ఎల్లవ్వతో కలిసి దుబ్బాక మండలంలోని పెద్ద చీకోడ్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వచ్చారు. సాయంత్రం భార్యతో కలిసి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా పోతారానికి చెందిన గడీల శ్రీనివాస్‌రెడ్డి దుబ్బాకలో పని ముగించుకొని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తున్నారు. పెద్దచీకోడ్ వెళ్లే దారిలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో సుకూరి భాగయ్య తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు, శ్రీనివాస్‌రెడ్డికి గాయాలయ్యాయి. ఫిర్యాదు అందలేదని దుబ్బాక పోలీసులు తెలిపారు.

ఉద్యోగం పేరుతో మోసం

హైదరాబాద్: ఉద్యోగం పేరుతో డబ్బులు దండుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. హైదరాబాద్ మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రకాశం జిల్లాకు చెందిన వైష్ణవి టెలీకాలర్‌గా పనిచేస్తూ.. మధురానగర్‌లోని యెగితా లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. గతంలో సంగారెడ్డి జిల్లా రుద్రారం ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కమ్మరి వీరేందర్ పరిచయమయ్యాడు. ఉద్యోగం కల్పిస్తానని నమ్మించాడు. ఆగస్టు 8న క్విక్ సన్ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ కంపెనీలో ఇంటర్వ్యూ నిర్వహించి వెబ్ డిజైనర్‌గా ఉద్యోగానికి ఎంపికైనట్లు చెప్పారు. డబ్బులు కట్టనిదే ఉద్యోగం రాదని, పలువురికి ఇవ్వాల్సి ఉంటుందని వీరేందర్ చెప్పడంతో ఆగస్టు 12 నుంచి ఈనెల 9 వరకు దఫదఫాలుగా రూ. 3.5 లక్షలు చెల్లించింది. మరిన్ని డబ్బులకు వేధిస్తుండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భార్య తిరిగి రాలేదని మేస్త్రీ ఆత్మహత్య

వికారాబాద్, న్యూస్‌టుడే: దసరా పండుగకు పుట్టింటికి వెళ్లిన భార్యాపిల్లలు చిన్నపాటి మనస్పర్థలతో కాపురానికి రాకపోవడంతో ఒంటరిగా మిగిలాడు. మద్యం తాగిన మత్తులో భార్యాపిల్లలు గుర్తుకు వచ్చి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ మండలం సిద్దులూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. వికారాబాద్ ఎస్ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలు.. కర్ణాటక రాష్ట్రం చించోళి తాలూకాకు చెందిన ఉప్పరి శ్రీకాంత్ (37), రేణుక దంపతులకు సంజన, స్వాతి, బస్వరాజ్, రితీష్‌లు సంతానం. బతుకుతెరువు కోసం ఏడాది కిందట భార్యాపిల్లలతో వచ్చి సిద్దులూర్ శివారులోని ఓ వ్యవసాయక్షేత్రంలో ఉంటున్నారు. మేస్త్రి పనిచేసే శ్రీకాంత్ తరచూ మద్యం తాగి భార్యతో గొడవపడేవాడు. దసరా పండుగకు అందరూ కలిసి సంతోషంగా సొంత గ్రామానికి వెళ్లారు. పండుగ అనంతరం భర్తతో సిద్దులూర్‌కు తిరిగి రావడానికి భార్య అంగీకరించలేదు. తీరు మార్చుకుంటేనే పుట్టింటికి వస్తానని వాదనకు దిగింది. అయినా లెక్క చేయకుండా భార్యాపిల్లలను అక్కడే వదిలేసి వచ్చాడు. ఒంటరితనం భరించలేక మద్యం మత్తులో వ్యవసాయక్షేత్రంలోని గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పండుగకు తల్లిగారింటికి పంపలేదని వివాహిత బలవన్మరణం



సౌమ్య

చేర్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పంపలేదన్న కారణంతో వివాహిత బలవన్మరణానికి పాల్పడిన సంఘటన చేర్యాల మండలం ఆకునూరులో జరిగింది. ఎస్సై నీరేశ్ తెలిపిన వివరాలు.. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం క్యాతంపల్లికి చెందిన ముక్కెల మంజుల-రాంరెడ్డిల కుమార్తె సౌమ్య(22)ను నాలుగేళ్ల క్రితం ఆకునూరుకు చెందిన పెంటపర్తి శ్రావణ్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వారికి ఏడాదిన్నర కుమార్తె ఉంది. పండుగకు సౌమ్యను ఆమె భర్త పుట్టింటికి పంపలేదు. మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన భర్త, కుటుంబ సభ్యులు ఆమెను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం సిద్దిపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తల్లి మంజుల ఫిర్యాదు చేశారు.


రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి..

చేగుంట, న్యూస్‌టుడే: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం వడియారం శివారులో బుధవారం జరిగింది. నిజామాబాద్ రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాలు.. వడియారం-మాసాయిపేట రైల్వేస్టేషన్ల మధ్య సుమారు 55 ఏళ్ల వయసున్న గుర్తుతెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఇతనికి సంబంధించినవారు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జీవితంపై విరక్తితో రైతు..

తొగుట, న్యూస్‌టుడే: జీవితంపై విరక్తి చెందిన ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తొగుట మండలం కాన్గల్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. తొగుట ఎస్సై రావికాంతరావు కథనం ప్రకారం.. ముడికె యాదయ్య(40) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంటినుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని ముచ్చర్ల నర్సయ్యకు చెందిన వ్యవసాయ భూమివద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై వెల్లడించారు.

కాపాడండీ..



జగదేవపూర్ మండలం తీగుల్ పరిధిలోని పురాతన ప్రార్థన మందిరం

అయ్యలారా.. అమ్మలారా.. మేము చారిత్రక ఆధారాలం. శతాబ్దాల కాలంలో అప్పటి రాజులు తమ అవసరాల కోసం పటిష్ఠంగా నిర్మించారు. ఇప్పటి వరకూ చెక్కుచెదరకుండా ఉన్నాం. ప్రస్తుతం మామీద మొక్కలు, తీగలు పెరిగి, వేళ్లూనుకుంటూ మా పటిష్ఠతకు భంగం కలిగిస్తున్నాయి. ప్రజలారా.. మీరు ప్రజాప్రతినిధుల ద్వారానో, అధికారుల ద్వారానో, స్వచ్ఛందంగా సేవలు అందించే యువజన సంఘాలతోనో మమ్మలను మీ భవిష్యత్తు కోసం కాపాడండి. పరిసరాల్లో వ్యర్థాలు లేకుండా.. మొక్కలు పెరగకుండా శుభ్రం చేస్తే మీ ఊరికి మేము గుర్తింపు కలిగిస్తామని మరువొద్దు. చరిత్ర సాక్ష్యాలు లేకుంటే భవిష్యత్తు ప్రణాళికలు సక్రమంగా వేయడం కుదరదని గమనించండి. శిథిలం కాకముందే సరి చేయండి.

ఇట్లు మీ ...

సంగారెడ్డి జిల్లా అందోలులో గైని (గడీల ద్వారం), రెడ్డి రాజుల కాలం సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తీగుల్‌లో రెండో నిజాం నవాబు నిర్మించిన ప్రార్థన మందిరం
– న్యూస్‌టుడే, జోగిపేట టౌన్, జగదేవపూర్



అందోలులో గడీ ప్రధాన ద్వారంపై చెట్లు

బోధన వృత్తికి పట్టం.. అక్కన్నపేట విశేషం

- అక్కన్నపేటలో జనాభా 4,545
- 2012 డీఎస్సీలో గ్రామం నుంచి అత్యధికంగా 14 మంది అర్హులు కావడం విశేషం
- గ్రామంలో 1960 నుంచి ప్రభుత్వ ఉద్యోగులు 140
- ప్రస్తుతం ఉపాధ్యాయులు 50 మంది ఉన్నారు.
- ప్రైవేటు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా ఉన్నారు.

రామాయంపేట, న్యూస్‌టుడే: ఎవరో ఒకరు.. ఎపుడో అపుడు.. ఒకరిని చూసి మరొకరు అన్నట్టుగా ఆ ఊరిలో అందరూ ఉద్యోగాల బాటలో పయనిస్తున్నారు. ఒకరు ఒక ఇద్దరు కాదు.. ఏకంగా 100 మందికి పైగా ఉద్యోగాలు సాధించడం విశేషం. రామాయంపేట మండల పరిధి అక్కన్న పేటలో 1,010 కుటుంబాలు ఉన్నాయి. ఊరిలో అన్ని వర్గాల వారు ఉన్నారు. అధికంగా ప్రభుత్వ ఉద్యోగాల వైపు అందులోనూ ఉపాధ్యాయులుగా స్థిరపడేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాలు నిదర్శనం.


ప్రతి డీఎస్సీలోను చోటు

సాధారణంగా గ్రామంలో ఒకరికి ఉద్యోగం వచ్చిందంటే అందులో ప్రభుత్వ ఉద్యోగం ఉంటే ఊరందరికీ తెలిసిపోతుంది. అక్కన్న పేట గ్రామంలో మాత్రం అవి సర్వసాధారణమే. ప్రతి డీఎస్సీలోను ఒకరికి మించి సాధిస్తుండటం విశేషం. ఇలా ఇప్పటివరకు 50 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారు. ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్జీటీలో ఇద్దరు.. స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ జిలాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించారు.

స్వయంపాలన దినోత్సవ స్ఫూర్తి

పాఠశాలలో నిర్వహించిన స్వయంపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా వ్యవహరించడం స్ఫూర్తి నింపింది. ఆ ఒక్క రోజే కాకుండా ఉపాధ్యాయులుగా ఎదగాలన్న ఆకాంక్ష కలిగిందంటారు.. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రామచందర్. 1982లో ఉపాధ్యాయుడిగా అర్హత సాధించిన ఆయన స్ఫూర్తితో గ్రామంలో ఇప్పటివరకు 50 మందికి పైగా విధులు నిర్వహిస్తున్నారు.

నిపుణులను తయారు చేసేది బోధన వృత్తి



ఉపాధ్యాయ వృత్తి స్వచ్ఛమైనది. సమాజంలోని అన్ని రంగాల్లోనూ నిపుణులను తయారు చేసేది ఉపాధ్యాయులే. భవిష్యత్తు తరాన్ని సవ్యదిశలో నడిపించేది ఈ వృత్తే. గ్రామంలో బోధననే ఎంచుకోవాలని విద్యార్థులను ప్రోత్సహిస్తున్నా.
రామచందర్, విశ్రాంత ఉపాధ్యాయుడు

గిరిపుత్రుడు.. గెలుపు కెరటం

- జమ్మూకశ్మీర్‌లో ఎఫ్‌సీఐ జీఎంగా ప్రస్థానం



సేంద్రియ ఎరువుతో పూల సాగు

న్యూస్‌టుడే, నర్సాపూర్: వారిది నిరుపేద గిరిజన కుటుంబం.. వ్యవసాయం చేస్తేనే పూట గడిచే రోజులవి. పరిస్థితులకు తలవంచలేదు. ఏదో సాధించాలనే తపన... లక్ష్యం చేరుకోవాలనే పట్టుదల... ఎన్ని అవాంతరాలు ఎదురైనా విజయం సాధించే వరకు విశ్రమించలేదు. నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన ఛత్రునాయక్ ఉన్నతంగా ఎదిగారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్‌లోని భారత ఆహార సంస్థలో (ఎఫ్‌సీఐ) జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగారు.

మహ్మదాబాద్ తండా నుంచి..

నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ తండాకు చెందిన లున్సావత్ మున్నిభాయ్, తుక్యాల మొదటి కుమారుడైన ఛత్రునాయక్‌కు కాలినడకన బడికి వెళ్లి చదువుకోవాలన్నా సరైన దారి లేక చాలా కష్టంగా ఉండేది. నర్సాపూర్‌కు నడుస్తూ వెళ్లి పదో తరగతి చదివారు. హాలియాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. హైదరాబాద్ జెఎన్టీయూలో పీజీ పూర్తిచేశాక 1989లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో టెక్నికల్ అధికారిగా కేంద్రం ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 1977లో ఎఫ్‌సీఐలో సహాయ మేనేజర్‌గా బెంగళూరులో పనిచేశారు. హైదరాబాద్, నల్గొండ, తార్నాక, కరీంనగర్‌లో మేనేజర్‌గా చేశారు. డీజీఎంగా పదోన్నతి లభించడంతో అస్సాం, గవుహాటిల్లో విధులు నిర్వహించారు. జనరల్ మేనేజర్‌గా పదోన్నతి పొంది ముంబయికి బదిలీ అయ్యారు. మూడు సంవత్సరాల అనంతరం జమ్మూకశ్మీర్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవా, గుజరాత్ రాష్ట్రాలకు జీఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట 1.50 లక్షల టన్నుల బియ్యం సరఫరాకు సంబంధించి విధులు చేపడుతున్నారు.

సేంద్రియ సాగుపై మక్కువ

ఆయనకు సెలవు దొరికితే చాలు మహ్మదాబాద్ తండాకు వస్తారు. పొలాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తారు. బీర, కాకర, వంగ, బెండ, మిర్చి, తీగ జాతి కూరగాయలను రసాయనాలు లేకుండా పండిస్తున్నారు. పెద్దఎత్తున బంతి పూలను సాగు చేస్తున్నారు. తనకు జన్మనిచ్చిన గడ్డకు ఏదోఒకటి చేయాలనే తపన ఆయనది. ప్రస్తుతం తాజామాజీ ఎంపీటీసీ సంధ్యారాణి ఛత్రూరాయక్ భార్య. కుమారుడు యువహీరో అనురాగ్. 15 ఆలయాల నిర్మాణాలకు ఆర్థిక సాయం చేశారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు



జిన్నారంలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తూ...

జిన్నారం, న్యూస్‌టుడే: వికారాబాద్‌కు చెందిన వృద్ధురాలు శాంతాబాయి వందేళ్లు పూర్తిచేసుకున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఉంటున్న ఆమె కూతురు ఇంటికి వచ్చింది. అక్కడే జరిగిన వేడుక ఇక్కడే నిర్వహించారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దాదాపు 70 మందికిపైగా ఆమె కుటుంబ సభ్యులు ఉన్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యులతో పాటు పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

శాంతి సంఘీభావ మహాసభ 19న

తాండూరు(గ్రామీణ, న్యూస్‌టుడే: ఈనెల 19న అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ప్రథమ మహాసభ ఉంటుందని.. ఆ సంఘం జిల్లా కార్యదర్శి, తాండూరు మండలం నారాయణ్‌పూర్‌కు చెందిన టి.రాజశేఖర్ సూచించారు. వికారాబాద్‌లోని సత్యభారతి వేడుక వేదికలో ఉంటుందన్నారు.

దారి పక్కనే.. ప్రమాద ఘంటికలు

నోరు తెరుచుకున్న బావులు, చెరువులతో ఆందోళన

'దౌల్తాబాద్‌లోని మల్లె సాహెబ్ దర్గా సమీపంలో చెరువు కట్టపై కొత్తగా రోడ్డు నిర్మించారు. అది రోడ్డుకు సమాంతరంగా ఉంది. వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పితే చెరువు లోకి దూసుకెళ్లే ప్రమాదముంది. తాజాగా రావల్‌పల్లి నుంచి మండలకేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తున్న ఓ యువకుడు బండి అదుపుతప్పి చెరువులోకి దూసుకెళ్లి మృత్యువాత పడ్డారు. కర్ణాటక ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సర్కిగా ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై వెళుతూ.. ప్రమాదానికి గురయ్యారు.' - న్యూస్‌టుడే, దౌల్తాబాద్

పల్లెలకు వెళ్లే రోడ్ల అంచున పురాతన బావులు, చెరువు కట్టలకు రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా మెదక్ జిల్లాలోని శివ్వంపేట మండలంలో కారు బావిలో పడి 7గురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం దరిమిలా. . సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ పురాతన బావులతో ఉపయోగం లేదు. వాటి చుట్టూ రక్షణ గోడలు నిర్మించాల్సి ఉన్నా.. ఆ ప్రయత్నం జరగలేదు. వాటి సమీపంలో పొదలు, పెరగడంతో రాత్రి సమయంలో, కొత్తవారికీ ఆప్రాంతంలో ఏముందో తెలియని పరిస్థితి నెలకొంది.

మచ్చుకు కొన్ని..

● దౌల్తాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ సమీపాన మలుపు వద్ద ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా మారింది. ● ఈర్లపల్లి నుంచి ఇందాపూర్ వెళ్లే దారిలో ఉన్న వ్యవసాయ బావి అంచుల వెంట పొదలు పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనానికి దారి ఇచ్చినా.. వాహనదారు బావిలో పడే ప్రమాదముంది స్థానికులు తెలిపారు. ● దౌల్తాబాద్ నుంచి కొన్ని వెళ్లే రెండు వరుసల దారి పక్కనే కొలబావి సమీపంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ● సుల్తాన్‌పూర్, దేశాయిపల్లి సమీపంలో తారు రోడ్డు అంచున సుమారు 10 మీటర్ల కోసుకు పోయిందని రాత్రి సమయంలో ప్రయాణం ఇబ్బందిగా ఉందని పలువురు వాపోతున్నారు. ● కొడంగల్ నుంచి హుస్నాబాద్‌పూర్, గుండ్లకుంట గ్రామాల మధ్య రెండు బావులకు రక్షణ గోడలు లేవు. ● కొడంగల్ నుంచి కొండారెడ్డిపల్లి వెళ్లే దారిలో మూడు బావులు ప్రమాదకరంగా మారాయని ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు. ● కొడంగల్ నుంచి రేగడిమైలారం వెళ్లే దారిలో అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఉన్న బావి ప్రమాదకరంగా మారింది.



దౌల్తాబాద్ పెద్ద చెరువు అంచున ప్రమాదకరంగా..

చర్యలు తీసుకుంటాం..

- రవికిరణ్, పీఆర్ ఏఈ

పురాతన బావులు రోడ్డుకు సమీపంలో ఎక్కడెక్కడ ఉన్నాయి. రక్షణ గోడలు కల్వర్టుల పరిస్థితి ఏమిటీ? అన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. తారు రోడ్ల అంచున ఏర్పడిన గోతులను వెంటనే మట్టితో పూడ్చేలా తగు చర్యలు తీసుకుంటాం.



గొట్టిముక్కల గ్రామంలో..

వికారాబాద్ గ్రామీణ: గ్రామ మధ్యలో ఉన్న బావిలో నిండా నీరుంది. కానీ దానికి కంచె లేక పోవడంతో ప్రమాదకరంగా మారిందని గొట్టిముక్కల గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కంచె ఏర్పాటు చేసినా పాడైపోయింది. అధికారులు మరోసారి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. లేకుంటే చిన్నారులు, పశువులు, జీవాలు అందులో పడే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తం అవుతోంది.

మేమున్నాం.. మీకు తోడుగా

వికారాబాద్‌టౌన్: 80742 74587
తాండూరు టౌన్: 80095 73260
పరిగి: 80085 73272
కొడంగల్: 94403 34770
(10 AM TO 1 PM)

న్యూస్‌టుడే, పరిగి గ్రామీణ, దౌల్తాబాద్, తాండూరు టౌన్, కుల్కచర్ల గ్రామీణ, పూడూరు, కుల్కచర్ల:

? జాఫర్‌పల్లి పరిసరాల్లో పరిగి-షాద్‌నగర్ ప్రధాన రహదారిపై కల్వర్టుపై రోడ్డు ధ్వంసమై ఇనుప చువ్వలు తేలాయి. ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. -రమేష్, కృష్ణ, సత్యనారాయణరెడ్డి

✓ చువ్వలు తేలిందని మాదృష్టికి వచ్చింది. రెండు మూడు రోజుల్లో సిమెంటు కాంక్రీట్ వేయించి మరమ్మతు చేయిస్తాం. - డి.మహేష్, ఏఈ ఆర్‌అండ్‌బీ శాఖ, పరిగి

? యశోదానగర్ వీధుల్లో మురుగు కాల్వలు పూర్తి స్థాయిలో శుభ్రం చేయటం లేదు. - ప్రవీణ్, తాండూరు.

✓ పూర్తి స్థాయిలో శుభ్రం చేయటానికి చర్యలు తీసుకుంటాం. -విక్రమ సింహారెడ్డి, పురపాలక సంఘం కమిషనరు తాండూరు

? ఉన్నత పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - శ్రీహరిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, దౌల్తాబాద్.

? పుట్టపహాడ్ చౌరస్తాలో ఆకాశ దీపాలు పాడైపోయి చాలా రోజులు కావస్తోంది. రాత్రి సమయంలో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతోంది. - రాజు, స్థానికుడు

✓ వాటికి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉంది. సమస్యను మండల అధికారుల దృష్టికి తీసుకు వెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం. - కవిత, పంచాయతీ కార్యదర్శి.

? గ్రామంలోని ఎస్సీ కాలనీలో పాతబావి కొంత కాలంగా వాడకం లేదు, పైభాగం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని చెప్పినా పట్టించుకోవడం లేదు. - వెంకటయ్య, పెద్దఉమ్మెంతాల్

✓ వెంటనే పరిశీలించి పైభాగం ఏర్పాటు చేయించేలా చూస్తాం. అవసరమైతే పూడ్చేందుకు పంచాయతీ తీర్మానం చేయిస్తాం. - సుందర్, ఎంపీవో

? రాంనగర్‌లో రాత్రి, పగలు తేడా లేకుండా వీధి దీపాలు వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోంది. - రాజు, రాంనగర్

✓ మండల పరిధిలో పగలే ఎక్కడెక్కడ వీధి దీపాలు వెలుగుతున్నాయన్న దాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - అహ్మద్ సబ్‌ఇంజినీర్ ట్రాన్స్‌కో కుల్కచర్ల.



పుల్లలకు ప్రమాదాలు ఆగుతాయా?

పూడూరు, న్యూస్‌టుడే: మన్నెగూడ నుంచి చన్‌గోముల్ వెళ్లే ప్రధాన దారిలో గుంతలు ఏర్పడి ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీరాజ్ పరిధిలోకి వచ్చే రహదారి ఏళ్ల కాలంగా రీ, బీటీ పనులు చేపట్టలేదు. దీంతో ఐదు కిలోమీటర్ల దూరం వరకు చాలా గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహన దారులు అదుపుతప్పి పడుతున్నారు.

అంచున గుంత.. వాహనదారుల చింత



కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: కుల్కచర్ల నుంచి బండవెల్కిచర్లకు వెళ్లే దారిలో పాంబండ దేవాలయం దగ్గర రోడ్డు అంచులు ప్రమాదకరంగా మారాయి. వర్షాలకు రోడ్డు వెంట మట్టి కొట్టుకు పోవడమే కారణం. చాలా రోజులుగా ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి కొట్టుకు పోయి రోడ్డు వెంట కాలువలు ఏర్పడ్డాయి. దీంతో రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు ఎటూ వెళ్లలేని పరిస్థితి ఉంది. అధికారులు దృష్టి సారించి రోడ్డు అంచుల వెంబడి మట్టిని పోయించి మరమ్మతులు చేయించేలా చూడాలని వాహన చోదకులు కోరుతున్నారు.

నిత్యం నీటి వృథా!



వికారాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే : నిత్యం నిరు వృథాగా పోతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. జలభాండాగారానికి మరమ్మతులు చేయడం లేదు. కొటాలగూడ గ్రామంలో పరిస్థితి ఇది. ట్యాంకు నిండా నీరు నింపితే లీకేజీలతో నీరంతా వృథాగా పోతోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు లీకేజీలను సరిచేయాలని కోరారు.

శబరిమలకు పాదయాత్ర



బయల్దేరుతున్న స్వాములు

పరిగి, న్యూస్‌టుడే: పరిగి నుంచి పలువురు అయ్యప్ప భక్తులు బుధవారం శబరిమలకు పాదయాత్రగా బయల్దేరి వెళ్లారు. బహార్‌పేట హనుమాన్ దేవాలయంలో ఇరుముడి నిర్వహించిన అనంతరం 13 మంది కాలినడకన వెళ్లారు.

తాండూరుగ్రామీణ: పౌర్ణమి పురస్కరించుకొని తాండూరు అయ్యప్ప స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సంఘం ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభం అవుతాయన్నారు.

ఆలయాల నిర్మాణానికి కృషి



విగ్రహప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే

కుల్కచర్ల గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలయాల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామని మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి అన్నారు. అంతారంలో నిర్వహించిన ఆంజనేయ స్వామి, శివలింగం, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో.. జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాందాస్ నాయక్ పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అఖిల పక్షం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొడంగల్, న్యూస్‌టుడే: ఓటు హక్కు నమోదుపై వివిధ పార్టీల నాయకులతో బుధవారం అఖిల పక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో పాటు అన్ని పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

బషీరాబాద్, న్యూస్‌టుడే: తప్పులు లేని ఓటరు జాబితా ఉండాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటయ్య అన్నారు. బుధవారం కార్యాలయంలో బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా

పెద్దేముల్, న్యూస్‌టుడే: మారుమూల పల్లెల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ.. పేదలకు ఆరోగ్య పరంగా భరోసా కల్పిస్తున్నారని తాండూర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు లంక నర్సింలు అన్నారు. అడిగిచెర్లలో ఎల్ఎన్ఆర్, మహావీర్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్తు మాజీ ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచులు శివరాం పాల్గొన్నారు.

తాండూరు టౌన్: తాండూరులో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టేషన్ ఆవరణలో గురువారం కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గుర్తింపు కార్డులు కలిగి ఉన్న కార్మికులకు అందరికి వైద్య పరీక్షలు చేశారు. మొత్తం 250 మంది కార్మికులకు పరీక్షలు నిర్వహించారు.



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కమ్మేసిన మంచు.. కన్పించని ఉషస్సు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పొగ మంచు కమ్మేసింది. బుధవారం ఉదయం 8 గంటల వరకు ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రధాన రోడ్డుపై ప్రయాణించేవారు దారి స్పష్టంగా కన్పించక ఇబ్బందులు పడ్డారు.

తాండూరు టౌన్, న్యూస్‌టుడే : పట్టణంలో పొగ మంచు ఆవరించింది. అంతర్గతదారులతో పాటు ప్రధాన రోడ్లను కమ్మేసింది. ఉదయం 6 గంటల నుంచి 8 గంటల దాకా ఇదే పరిస్థితి. రోడ్ల మీద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

కొడంగల్, న్యూస్‌టుడే: ఉదయం 7.30 గంటల వరకు పట్టణమంతా.. పొగమంచుతో నిండిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. చాలా ప్రాంతాల్లో ఇళ్లు, వస్తువులు కనిపించలేదు. వాహనదారులు లైట్లు వేసుకొని బండి నడిపించాల్సి వచ్చింది.



తాండూరులో ఉదయం ఎనిమిది గంటలకు ఇలా..

బొంరాస్‌పేట: తెల్లవారుజామున దట్టమైన పొగ మంచు కమ్మేసింది. 5.30 నుంచి ఉదయం 7గంటల వరకు మంచు కమ్మేయడంతో రహదారులపై వెళ్లే వారు ఇబ్బందులు పడ్డారు.

భవనంపై నుంచి పడి కూలీ మృతి

వికారాబాద్, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు పడి కూలీ మృతి చెందిన సంఘటన వికారాబాద్ పట్టణం ఎన్నెపల్లిలో బుధవారం జరిగింది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు చెందిన వడ్డె అశోక్(35) బతుకుతెరువు కోసం వికారాబాద్‌లోని శివరామ్‌నగర్ కాలనీలో భార్య సుజాత, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటూ భవన నిర్మాణకూలీగా పని చేస్తున్నాడు. ఎన్నెపల్లిలో నిర్మిస్తున్న ఓ భవనంలో కూలి పనులు చేస్తూ. . కాలు జారి కింద పడి మృతి చెందాడు. భవన నిర్మాణ యజమాని నిర్లక్ష్యమే మృతికి కారణమంటూ.. సీఐటీయూ నాయకులు ఆరోపించారు. నష్ట పరిహారం చెల్లించాలంటూ మృతదేహాన్ని భవనం ముందే ఉంచి తోటి కూలీలు ఆందోళనకు దిగారు. పోలీసులు రంగంలోకి దిగి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి శవాగారానికి తరలించారు. మృతుని భార్య సుజాత నుంచి వివరాలు సేకరించామని, ఇంకా ఫిర్యాదు అందలేదని ఎస్సై సత్యనారాయణరాజు తెలిపారు.

ఇద్దరు సీఐలకు పోస్టింగ్‌లు

వికారాబాద్: ఇద్దరు సీఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. ధారూర్‌లో విధులు నిర్వహిస్తున్న బీమ్‌కుమార్‌ను వికారాబాద్ పట్టణ సీఐగా, సీసీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న రఘు రాములును ధారూర్ సీఐగా నియమించారు.

విద్యుదాఘాతానికి గురై లష్కర్ దుర్మరణం

ధారూర్: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని నాగసమందర్ కల్వర్టు సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోట్‌పల్లి మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇస్మాయిల్(45) సంవత్సరం నుంచి నీటి పారుదల శాఖలో లష్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువల ఆధునికీకరణలో భాగంగా బుధవారం నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బందితో కలిసి సర్వే పనులు నిర్వహిస్తున్నారు. ఇస్మాయిల్ అనే వ్యక్తి రీడింగ్ స్టాఫ్ హ్యాండిల్ పట్టుకొని వెళ్తుండగా ప్రమాదవశత్తు హ్యాండిల్ విద్యుత్ తీగలకు తగిలి కిందపడిపోయాడు. గమనించిన అధికారులు, సిబ్బంది వెంటనే అతనిని కారులో ధారూర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి, తరువాత వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య మహ్మద్ అలీమాబేగం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సంగమేష్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

18 ఏళ్లు నిండాకే పెళ్లి చేసుకుంటాం..

బషీరాబాద్: 18 ఏళ్ల నిండిన తర్వాతనే పెళ్లి చేసుకుంటానని ఓ బాలిక పోలీసులకు, చైల్డ్ లైన్ ప్రతినిధులకు తెలిపింది. ఈ సంఘటన బషీరాబాద్ మండలంలోని ఓ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఓ గ్రామానికి చెందిన బాలిక (16), అదే గ్రామానికి చెందిన బాలుడు (18) కొన్ని నెలలుగా ప్రేమించుకుంటున్నారు. వివాహం చేసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే బాలిక మాత్రం 18ఏళ్ల తర్వాతనే పెళ్లి చేసుకుంటానని అనడంతో ఈ విషయమై ఇటీవల గొడవ జరిగింది. విషయం తెలుసుకున్న చైల్డ్‌లైన్ ప్రతినిధులు గ్రామానికి వెళ్లి పెళ్లీడుపై ఇద్దరికీ, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్ లైన్ ప్రతినిధి నరేష్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన పాత్రల పంపిణీ

చిట్టిగణాపూర్(తాండూరు గ్రామీణ), న్యూస్‌టుడే: చిట్టిగణాపూర్‌కు చెందిన రవిపటేల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసే గిన్నెలను బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు.

పల్లెల్లో భారీ వర్షం

పెద్దేముల్, న్యూస్‌టుడే: పలు గ్రామాల్లో బుధవారం ఉదయం భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటుచేసుకొని చీకట్లు కమ్ముకున్నాయి. వాన రాకతో విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులకు గురయ్యారు.



దెబ్బతిన్న పత్తి పంటలు..

కొడంగల్: పలు గ్రామాల్లో ఉదయం నుంచి కురిసిన వర్షానికి పత్తి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షం కారణంగా పత్తి పంట నల్లగా మారుతుందని దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా మహేందర్

వికారాబాద్ కలెక్టరేట్: వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్‌గా కె. మహేందర్ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకు గండిపేట సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహించారు.

సీపీఎం సభలకు తరలిరండి

పరిగి: తాండూరులో ఈనెల 19, 20 తేదీల్లో జరగనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య కోరారు. బుధవారం పరిగిలో మహాసభలకు సంబంధించిన గోడ ప్రతులను విడుదల చేసి మాట్లాడారు.

సమస్యల తిష్ఠ

ఇబ్బందుల్లో కాలనీవాసులు

న్యూస్‌టుడే, బొంరాస్‌పేట

మండల కేంద్రం సమస్యలకు నిలయంగా మారింది. అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. మురుగు కాల్వలు లేక పారిశుద్ధ్యం లోపిస్తుంది. చిన్నపాటి వర్షం కురిసినా రహదారులు బురదగా మారుతున్నాయి. మురుగు కాల్వలు లేక నీరు ఇళ్ల మధ్యే నిలుస్తుంది. దీనివల్ల దోమలు వ్యాపించి రోగాల బారిన పడుతున్నారు. పేరుకు మండల కేంద్రం అయినా అందుకు తగ్గట్లు బొంరాస్‌పేటలో మౌలిక సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందిగా మారింది.



కొత్తకాలనీలో ఇళ్ల మధ్య నిలిచిన వర్షపు నీరు

మచ్చుకు కొన్ని..

● ఆంజనేయస్వామి దేవాలయం నుంచి పోచమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. కాలి నడకన కూడా వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆంజనేయస్వామి దేవాలయం నుంచి కమ్మరి వాడ ప్రారంభంలో ఉన్న బురుజు వరకు ఏళ్ల క్రితం వేసిన సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది.

● ఎస్సీ కాలనీ నుంచి దుర్గామాత దేవాలయం వరకు ఉన్న రోడ్డు గుంతలు పడింది. పదో వార్డులో మురుగు కాల్వలు లేక ఇళ్ల మధ్యనే నీరు నిల్వ ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

● ప్రాథమిక పాఠశాల వెనుక నుంచి రైతు వేదిక వరకు మట్టి రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రైతు వేదికలో ఏవైనా సమావేశాలు ఉంటే జిల్లా అధికారులు ఈ రోడ్డు వెంటే వెళ్తుంటారు. కానీ ఎవరూ రోడ్డు దుస్థితి గురించి పట్టించుకోవడం లేదు.

పనులు మంజూరు కావాలి

- మహేష్‌కుమార్, ఎంపీవో

మండల కేంద్రంలోని కొత్త కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం కొరకు ఉన్నతాధికారులను అడిగాం. నిధులు మంజూరైతే పనులు చేపడుతాం. గ్రామంలోని పలుచోట్ల పటిష్ఠమైన డ్రైనేజీ వ్యవస్థ లేక పారిశుద్ధ్యం లోపిస్తుంది. పారిశుద్ధ్య కార్మికులతో సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. కొత్తగా పనులు మంజూరైతే మురుగు కాల్వలు, సీసీ రోడ్లు నిర్మిస్తాం.

కొత్త కాలనీలో సమస్యలు

మెట్లకుంటకు వెళ్లే రోడ్డుకు ఎడమ వైపున వెలసిన కొత్త కాలనీలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు లేవు. వర్షం పడితే వరద నీరంతా ఇళ్ల మధ్యే నిలుస్తుంది. కాలనీ ప్రజలు బయటకు రావాలంటే కష్టాలు పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించి దోమలు విజృంభిస్తున్నాయి.

శ్రమదానంతో బాగుపడిన రహదారి

కుల్కచర్ల, న్యూస్‌టుడే: రాంసింగ్‌నాయక్‌తండా రహదారిపై వాహనాల రాకపోలకు కొన్నాళ్లుగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. స్థానిక యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మరమ్మతు చేశారు. బాబీ, రాహుల్, హన్మంతు, భాస్కర్, రామ్, సచిన్, దశరథ్ తదితరులు మరమ్మతు చేసిన వారిలో ఉన్నారు.

విధుల్లో చేరిన సీహెచ్‌వో చంద్రప్రకాష్

యాలాల, న్యూస్‌టుడే: యాలాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌వోగా చంద్రప్రకాష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సూపర్‌వైజర్ భువనేశ్వరీ, సీనియర్ అసిస్టెంట్ బసయ్య గౌడ్, సిబ్బంది ఆయన్ను సత్కరించారు.

పంటనష్ట పరిహారం చెల్లించండి

పూడూరు, న్యూస్‌టుడే : ఇటీవల కురిసిన వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి ఆదుకోవాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కోరారు. మండల పరిధిలోని కంకల్‌లో బుధవారం పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పత్తి, మొక్కజొన్న, కంది పంటలతో పాటు అనేక ఎకరాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

వికారాబాద్‌లో 19న జిల్లా మహాసభ

వికారాబాద్ మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్ఓ) వికారాబాద్ జిల్లా ప్రథమ మహాసభ ఈనెల 19న శనివారం స్థానిక సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి పండిత్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు రాంమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, ఏఐపీఎస్ఓ జాతీయ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు హాజరవుతారన్నారు.